ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 12 మార్చి 2025



సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోండి



సందేహాలు నివృత్తి చేయనున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

రేపు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్

సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 87126 65552

వరంగల్ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత పెరిగింది.. దాంతో పాటే నేరాలు, మోసాలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. మాయమాటలు చెబుతూ.. వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. యాప్‌లు, రుణాలు, ఆఫర్లు అంటూ ఫోన్లు చేసి.. వినియోగదారుల డాటాను తస్కరించి బ్లాక్‌మెయిల్ చేస్తూ ఖాతాలను లూటీ చేస్తున్నారు సైబర్ నేరస్థులు. ఇలాంటి ఘటనలు ఇటీవల నిత్యకృత్యమయ్యాయి. రోజూ ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు వయసు, చదువుతో సంబంధం సైబర్ కేటుగాళ్ల వలలో పడుతూ సొమ్ములు పోగొట్టుకుంటున్నారు. చివరకు మనోవేదనతో ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. ఇలాంటి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 13వతేదీన 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్‌కు ఫోన్‌చేసి ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. సలహాలు పొందవచ్చు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్




మిర్చి ప్రాసెసింగ్ కేంద్రంలో మహిళా నిర్వాహకులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు

మేడారం వనదేవతలను దర్శించుకుంటున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క

కొండపర్తిని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతాం

- వికసిత్ భారత్ స్ఫూర్తిగా బ్రాండ్ ఇమేజ్ సాధిస్తాం
- దత్తత గ్రామ పర్యటనలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- బహుళ ఉపాధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- హాజరైన మంత్రి సీతక్క ఉన్నతాధికారులు

7



హామీలకు.. ఆమోదం వచ్చేనా?

- హైదరాబాద్‌కు దీటుగా డెవలప్ చేస్తామని పలుమార్లు ప్రకటించిన ప్రభుత్వం
- పెండింగ్ పనులు, ప్రాజెక్టులకు కేటాయింపులపై సర్వత్రా ఉత్కంఠ
- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఉమ్మడి జిల్లా అభివృద్ధి పై ప్రజల్లో పెరుగుతున్న ఆశలు, అంచనాలు

ఓరుగల్లు అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. కొంత కాలంగా ఉమ్మడి జిల్లాలోని పలు అభివృద్ధి పనులపై ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. చాలా పనులకు జీవోలు కూడా జారీ చేసింది. అయితే ఆ పనులకు నిధులు రాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఇక పలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న వాటికి కేటాయింపుల కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనైనా వాటికి ఆమోదం వస్తుందని.. సొమ్ముల కేటాయింపు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో సాగునీటికి పెద్దదిక్కుగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిధులు, వరంగల్ నగరంలో మెట్రో రైల్ సేవలతో పాటు ఐటీ పార్కు విస్తరణ, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం తదితర వాటికి ఇంకా అడుగులు పడటం లేదు. వీటితో పాటు అనేక నియోజకవర్గాల్లో ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల నిర్మాణం, వీవర్స్ పార్కులు, యూనివర్సిటీలు, కాలేజీలు, డ్రెయినేజీలు, మామునూరు విమా నాశ్రయం భూసేకరణ లాంటి వాటికి నిధులు లేక, కొన్నింటికి అనుమతులు రాక ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారు. మన ఎమ్మెల్యేలు అభివృద్ధిపై గళమెత్తుతారని.. సొమ్ములు సాధిస్తారన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రభుత్వం పూర్తి చేయాల్సిన ప్రధాన పనులు

వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.4,170 కోట్లు ఇస్తామన్నారు. ఈ నిధులను విడుదల చేయాల్సి ఉంది. వరంగల్ మహానగరంలో మెట్రో రైల్, ఐటీ పార్కు విస్తరణ జరగాల్సి ఉంది. మడికొండ, కొడకండ్ల వీవర్స్ పార్కుల అభివృద్ధికి కేటాయింపులు అవసరం. స్టేషన్‌ఘనపూర్‌లో లెదర్‌పార్కుపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు జరిగితే ఏళ్ల నాటి గ్రహణం వీడుతుందన్న అభిప్రాయాలున్నాయి. భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీ, బైపాస్ రోడ్డుపై కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. ఇక పాలకుర్తి-చెన్నూరు రిజర్వాయర్, కొనాయిమాకులలో ఎత్తిపోతలు, జనగామలో పాలిటెక్నిక్, డోర్నకల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలు వస్తాయన్న అంచనాల్లో ఉన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణకు ఇస్తామన్న రూ.205కోట్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు పెండింగ్ పనులు, ప్రాజెక్టులకు కేటాయింపులు జరగాల్సి ఉంది.

వివరాలు : 7 లో..



గిరిజన వర్సిటీ వీసీగా శ్రీనివాస్

ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

6

గజవాహనంపై లక్ష్మీనరసింహ స్వామి

కోటంచలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



గజవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

రేగొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : కోటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మూడో రోజూ వైభవంగా కొనసాగాయి. మంగళవారం ఉదయం ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వరికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం హోమం, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన గజవాహనంపై స్వామివారిని గోవిదం నామస్మరణ మధ్య ఊరేగించారు. సాయం త్రం చంద్రవాహనంపై స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మహేష్, ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్

- పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య
- రూ.200కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అందులో భాగంగా ఇందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. భూపాలపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా భూపాలపల్లికి అరుదైన అవకాశం దక్కిందని అన్నారు. ఈ క్రమంలోనే సదరు పాఠశాల భవనానికి రూ.200కోట్లు మంజూరుచేస్తూ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు వివరించారు. దీంతో ఈ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో కార్పొరేట్ విద్య అందుతుందని అన్నారు. రూ.200 కోట్లు మంజూరు చేయడంపై సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాలను నిర్మించి, అద్భుతమైన క్రీడా ప్రాంగణాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులకు సైతం అదే ఆవరణలో నివాసం ఉండేలా గృహ సముదాయాన్ని నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు అన్ని వసతులతో పాటు

» మిగతా 8వ పేజీలో...

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



కుమారస్వామి (ఫైల్)

చిట్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కైలాపూర్‌కు చెందిన రైతు మోత్కూరి కుమారస్వామి (35) తనకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేస్తు న్నాడు. రెండెకరాల్లో పత్తి, ఒక ఎకరంలో మిరప పంట సాగు చేస్తున్నాడు. పత్తి పంట తెగుళ్ల బారిన పడటంతో దానిని తొలగించి మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. పత్తి, మిరప పంటల్లో ఆశించిన దిగుబడి రాకపోవడం ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. వ్యసాయానికి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో కొద్దిరోజులుగా మనోవేదనకు గురయ్యాడు. మొక్కజొన్న పంటలను అడవి జంతువులు ధ్వంసం చేసున్నాయని కొద్దిరోజులుగా రాత్రి సమయంలో చుట్టుపక్కల రైతులతో కలిసి చేను వద్దనే కుమారస్వామి నిద్రిస్తున్నాడు. ఈక్ర మంలో సోమవారం రాత్రి ఇంటి వద్ద భోజనం చేసిన అతడు చేను వద్దకు కాపలాకని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లాడు. గ్రామ శివారు చేను వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విగతజీవిగా పడివుండటం గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అప్పుల బాధతోనే కుమార స్వామి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల రెండో ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు. మృతుడుకి భార్య కవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మందకుమార్‌మాదిగ

భూపాలపల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లో వర్గీకరణ చట్టం అమలయ్యాకే ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని మహాజన సోషలి స్టు పార్టీ జాతీయ నాయకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. అప్పటి వరకు పోటీ పరీక్షల ఫలితాలను వెల్లడించొద్దన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వ ర్యంలో నిరాహార దీక్ష చేప ట్టగా మంద కుమార్ మాదిగ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేసి నాలుగు విభాగాలుగా చేయడమే కాకుండా మాదిగలకు న్యాయం జరిగేలా చేయాలని డిమాండ్ చేశారు. ఇది జరిగేంత వరకు గ్రూపు 1, 2, 3, 4లకు సంబంధించిన ఉద్యోగాల భర్తీని తాత్కాలికంగా నిలిపివేయాలని అన్నారు. అలాగే మంత్రి వర్గంలో మాదిగలకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. 15లక్షల మంది ఉన్న మాలలకు ఐదు శాతం, 32లక్షలు మంది ఉన్న మాదిగలకు 11శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు నోముల శ్రీనివాస్, దోర్నాల రాజేందర్, దోర్నాల సారయ్య, అంతడుపుల సురేష్, అశోక్, రవి, భరత్, శ్రీకాంత్, రాజేష్, కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

ఇంటి స్థలం విషయంలో అన్నను చంపిన నిందితుడు

2019లో ఘటన.. తీర్పు వెలువరించిన భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కాటారం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఇంటి స్థలం విషయంలో అన్నపై బీరు బాటిల్‌తో దాడి చేసి హత్య చేసిన కేసులో తమ్ముడికి కోర్టు జీవిత ఖైదు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణమూర్తి మంగళ వారం తీర్పు చెప్పారు. సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన మారపాక నాగరా జు, అశోక్ అన్నదమ్ములు. గ్రామంలో ఇంటి స్థలం ఉండగా వీరిద్దరితో పాటు తల్లి శంకరమ్మ ముగ్గురు సమానంగా పంచుకున్నారు తన వాటాకు వచ్చిన స్థలంలో నాగరాజు చిన్న ఇల్లు కట్టుకున్నాడు. మద్యానికి బానిసైన అశోక్ తన వాటా స్థలాన్ని అమ్మేసి డబ్బులు ఖర్చు చేసుకున్నాడు. అనంతరం అన్నతో గొడవపడుతూ అతడు కట్టిన ఇంటిలో తనకు వాటా వస్తుందని, ఇవ్వకుంటే చంపుతానని బెదిరించేవా డు. దీంతో నాగరాజు కుటుంబం సహా వేరే గ్రామానికి వలస వెళ్లాడు. ఈ క్రమంలో ఎంపీటీసీ ఎన్నికల్లో ఓటు వేయడానికి నాగరాజు 2019 మే 10న గ్రామానికి వచ్చాడు. ఓటు వేసిన అనంతరం ఇంటికి రాగా మద్యం మత్తులో ఉన్న అశోక్ అన్నతో గొడవపడి ఖాళీ బీరు బాటిల్ పగులకొట్టి గొంతులో పొడిచాడు. దీంతో నాగరాజు మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్‌వో, హెడ్‌కానిస్టేబుల్ మహేందర్ కేసు నమోదు చేయగా సీఐ శివప్రసాద్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కాటారం సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ హథీరాం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించగా కోర్టు లైజన్ అధికారి ఏఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పీసీలు రమేష్, వినోద్‌లు సాక్షులను ప్రవేశపెట్టారు. అశోక్‌పై నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు జీవిత ఖైదు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్‌తో పాటు అప్పటి దర్యాప్తు అధికారులను ఎస్పీ కిరణ్‌ఖరే అభినందించారు.



మల్యాలలో రైతులకు సూచనలు ఇస్తున్న విజయనిర్మల

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మహబూబాబాద్ డీఏవో విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వరిలో ఆశిస్తున్న సుడిదోమ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల రైతులకు సూచించారు. మంగళవారం మహబూబాబాద్ మండలం మల్యాలోని పంటపొలాలను ఆమె క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో దోమ ఉధృతి విస్తృతంగా ఉందని, దాని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సుడిదోమ వల్ల గ్రాసీస్టంట్ అనే వైరస్ తెగులు వ్యాప్తి చెందుతుందని చెప్పారు.

దాని నివారణ కోసం తొలిదశలో ఎసిఫేట్-75, ఎస్‌పి 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి 0.4 గ్రాములు లేదా బ్యూప్రొఫెజిన్ 1.6 మి.మీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పురుగుల మందును పిచికారి చేసే ముందు పొలంలో నీటిని తగ్గించాలన్నారు. ఆమె వెంట మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అజ్మీర శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ వీసీగా శ్రీనివాస్

ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ



ములుగు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ములుగులోని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్స్‌లర్‌గా యెడవెల్లి లక్ష్మీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రేయా భరద్వాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ భవన సముదాయం నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో ములుగు శివారులోని జాకారంలో ఉన్న వైటీసీలో గత ఏడాది జూన్‌లో తరగతులు ప్రారంభమయ్యాయి. ఓఎస్డీ, పరీక్షల విభాగాధిపతుల పర్యవేక్షణలో యూనివర్సిటీ కొనసాగింది. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన శ్రీనివాస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లిషు డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తూ రిటైర్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అరోరా హయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అకాడమీ ప్రో వీసీగా పనిచేస్తున్నారు.

ఇంగ్లిషు లిటరేచర్, ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన శ్రీనివాస్ 37 సంవత్సరాలుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్నారు. 1992లో ఓయూ ఇంగ్లిషు విభాగంలో ప్రొఫెసర్‌గా చేరారు. తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీలో, ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేశారు. బెంగుళూరు నేషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలందించారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఇగ్లిషు బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా కూడా కొనసాగారు. ఆయన సమర్పించిన 15 పరిశోధనా పత్రాలు అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి.

ఏజెన్సీలో వాల్టా చట్టానికి తూట్లు

▸ నిబంధనలకు నీళ్లొదులుతున్న బోరు యజమానులు, దళారులు



కొత్తగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయతకు నిలయమైన కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాల్లో వాటర్, లాండ్ అండ్ ట్రీస్ యాక్ట్(వాల్టా)కు తూట్లు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా బోర్లు వేసి, ఏజెన్సీలో భూగర్భ జలాలు అడుగంటిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వాల్టా చట్టం అపహాస్యం పాలవుతోంది. ఓ పక్క భూగర్భ జలాలు అడుగంటి పోతున్నా ఇష్టం వచ్చినట్టు భూమికి తూట్లు పొడుస్తున్నారు. ఇష్టారీతిన బోరు బండి యజమానులు, దళారులు గ్రామాల్లో బోర్లు వేస్తుండడంతో జలాలు అడుగంటిపోతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో జలాలు ప్రమాదకర స్థాయిలో పడిపోయే అవకాశముంది.

వాల్టా చట్టంలోని నిబంధనలు ఏ ఒక్కరూ పాటించటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు

రెవెన్యూ, భూగర్భ జలశాఖ అధికారుల నిర్లక్ష్యం

అధికారులు అవగాహన లోపంతో ఉండడం. బోరు యజమానులు, దళారులకు అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇంకొందరు అధికారులు మామూళ్ల మాటున చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

యథేచ్ఛగా బోర్లు వేస్తుండడం, ఇసుకను అక్రమంగా తవ్వి తీయడం, మొరాన్ని తవ్వి తరలించడం, కొండలను పడగొట్టడం జరుగుతుండడంతో వాటిని సంరక్షించాలని ప్రభుత్వం వాల్టా చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ఈ చట్టం ప్రకారం.. ఏజెన్సీ ప్రాంతాల్లో బోర్లు వేయాలంటే తహసీల్దార్, భూగర్భజల శాఖ, విద్యుత్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. బోరు వేయాలనుకునే వారు తొలుత తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వినతిని తహసీల్దార్ పరిశీలించి అటవీ, భూగర్భశాఖాధికారులకు పంపిస్తారు. ఆపై భూగర్భ శాఖ అధికారులు బోరు వేయాలనుకునే స్థలాన్ని పరిశీలిస్తారు. ఆ స్థలంలో బోరు వేయడానికి అనుకూలమైన పరిస్థితులు ఉందా? లేదా? అని పరిశీలించి నిర్ధారణ చేస్తారు. భూగర్భ శాఖ అధికారులు అనుమతి ఇచ్చాక విద్యుత్‌శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. ఇన్ని శాఖలు అనుమతి ఇస్తే ఏజెన్సీ ప్రాంతంలో బోరు వేయాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి ఎలాంటి అనుమతులు లేకుండానే మండలంలో బోర్లు వేస్తున్నారు. భారీ ఎక్స్‌కవేటర్ యంత్రాలను ఉపయోగించి వ్యవసాయ బావులను తవ్వుతూ మొరాన్ని అమ్ముతూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

రైతులను దోచుకుంటున్న దళారులు

బోరు బండి యజమానులు, బోరు బండిని అద్దెకు తెచ్చి బోర్లు వేయిస్తున్న దళారులు రైతులను దగా చేస్తూ దోచుకుంటున్నారు. బోరును వేయించుకోవాలనుకునే రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. సంబంధిత అధికారుల ఆదేశాలు, అనుమతులు లేకుండానే భూపరీక్షలు చేయకుండానే బోరు వేయటంతో నీరు పడకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు వేలల్లో నష్టపోతుంటే దళారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు. రోడ్లపై అతివేగంతో ఇబ్బడిముమ్మడిగా మొరం తరలించే వాహనాలు తిరుగుతూ దుమ్ము ధూళి చెలరేగి ఇతర వాహనదారులకు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాల్టా చట్టాన్ని పాటించకుండా ఇష్టానుసారంగా బోరులు వేయకుండా నియంత్రించాలని, ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, భూగర్భ జలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వర్గీకరణ తర్వాతే ఫలితాలు విడుదల చేయాలి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



దీక్షలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు

ఏటూరునాగారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధం చేశాకే పోటీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు స్వామి మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ముందుగా ఎస్సీ వర్గీకరణను వెంటనే చట్టబద్ధం చేయాలని, అప్పటి వరకు గ్రూప్ వన్ ఉద్యోగ ఫలితాలను నిలిపివే యాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా విడుదల చేస్తున్న ప్రకటనలను నిలిపివేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై మాట తప్పారని విమర్శిస్తూ, ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రూప్-1,2,3తో పాటు తదితర పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ద్వారా ప్రకటన చేసి మాదిగ, మాదిగ ఉపకులాలకు ఎస్సీల్లో ఉన్న ఇతర కులాలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు వావిలాల సాంబశివరావు, జిల్లా నాయకులు ఎంపల్లి శంకర్ మాదిగ, దేపాక సతీష్, పడుదల సతీష్, ఎంపల్లి సునీల్, మండల అధికార ప్రతినిధి పరికి నర్సింగరావు, లక్ష్మీనారాయణ, ఎంఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై యువకుడి లైంగిక వేధింపులు?

▸ నాలుగు నెలల క్రితం ఘటన ▸ ఇటీవల బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వెలుగులోకి

కొత్తగూడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ వసతిగృహంలో ఉంటున్న విద్యార్థిని(14)పై ఓ యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. విద్యాసంస్థకు సరుకులు రవాణా చేసే ఓ వివాహమైన యువకుడు సుమారు నాలుగు నెలల క్రితం సరుకులు తెచ్చిన సమయంలో.. అక్కడ చదువుకుంటున్న ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి.. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత బాలిక ఆ సమయంలోనే హెచ్‌వోడీ దృష్టికి తీసుకెళ్లగా.. సదరు హెచ్‌వోడీ విద్యార్థినికి సర్దిచెప్పారని, దాంతో బాధిత విద్యార్థిని యువకుడి వేధింపుల గురించి తల్లిదండ్రులకు చెప్పలేదని సమాచారం. ఈ విషయం గురించి తోటి విద్యార్థులకు తెలియడంతో పాటు వారి మధ్య కొద్దిరోజులుగా చర్చ జరుగుతోంది. దీంతో ఆందోళన చెందిన సదరు బాలిక గత శనివారం తన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పగా.. కోపోద్రిక్తులైన బాలిక తల్లిదండ్రులు ఆదివారం విద్యాసంస్థకు వెళ్లి హెచ్‌వోడీని ప్రశ్నించినట్టు సమాచారం. ఆ తర్వాత వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు డివిజన్, రీజియన్, జిల్లాస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడు, హెచ్‌వోడీపై కేసు నమోదుచేసినట్టు సమాచారం.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు

షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని షీటీం ఎస్సై సునంద హెచ్చరించారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినుల పట్ల వెకిలిచేష్టలు చేస్తున్న ఆకతాయిలను మంగళవారం షీ టీం ఆధ్వర్యంలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం సదరు యువకులను రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుచ్చి వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి హెచ్చరించినట్లు తెలిపారు. ఎవరైనా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేస్తే వెంటనే డయల్ 100 షీ టీం నెంబర్ : 87126 56935కు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ ఎమర్జెన్సీ టీమ్‌ల ఏర్పాటు

మహబూబాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించడానికి, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టడానికి ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక విద్యుత్ సమస్యల వల్ల ఏర్పడే అంతరాయాలను తగ్గించడానికి బ్రేక్‌డౌన్ టీంలను ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు. ఈఆర్‌టీ వాహనాల ద్వారా జీపీఆర్ఎస్ లోకేషన్ పరంగా వేగంగా వెళ్లి పరిష్కరించేందుకు ఎంతగానో ఈఆర్‌టీ (ఎమర్జెన్సీ రిస్టోర్ టీం) వాహనాలు ఉపయోగపడుతాయని చెప్పారు. ఇందులో సంబంధిత మెటీరియల్ థర్మోవిజన్, కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సులెటర్లు, కండక్టర్లు, కేబుల్స్ ఉంటాయన్నారు. ఈ బ్రేక్‌డౌన్ టీంలో ఆరుగురు సభ్యులు ఉంటారని 24/7 అందుబాటులో ఉంటారని వివరించారు.

అంబులెన్స్ తరహాలో వెంటనే లోకేషన్‌కు చేరుకుని సరఫరాను త్వరగా పునరుద్ధరించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, అందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



కడేకల్ వద్ద బీటీ నిర్మాణం జరుగుతున్న దృశ్యం

జాతీయ రహదారికి మరమ్మతు

వాజేడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారికి మరమ్మతులు పనులు మంగళవారం ప్రారంభ మయ్యాయి. కడేకల్ నుంచి లొటపెటగండికి సుమారు 13 కిలో మీటర్ల మేర బీటీ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పనులకు రెండేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయి. మరమ్మతులు పూర్తయితే ప్రయాణికులకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

వాటర్ ట్యాంక్ పైనుంచి పడి కార్మికుడి మృతి



అంజాద్ మృతదేహం

డోర్నకల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూ బాబాద్ జిల్లా డోర్నకల్‌లో వాటర్‌ట్యాంక్ నిర్మిస్తుండగా, మంగళవారం ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికు లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డోర్నకల్ పట్టణంలోని రైల్వేక్వార్టర్స్‌లో నూతనంగా వాటర్ ట్యాంక్ (ఓహెచ్ఎస్ ఆర్)ను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం అంజాద్ (33) అనే కార్మికుడు సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. 40 అడుగుల ఎత్తులో నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద జారిపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణ వాసి. ఈ విషయాన్ని తోటి కార్మికులు అంజాద్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని రైల్వే అధికారులు సందర్శించారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు

భూసేకరణపై గ్రామసభ

కాటారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గూడూరు పెద్ద చెరువు కట్ట విస్తరణకు సంబంధించిన ఐదెకరాల 16గుంటల భూసేకరణ కోసం భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని జాదరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కాటారం సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ప్రాజెక్టుల భూసేకరణ విభాగం) మయాంక్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో పలువురు రైతులు హాజరై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలిపారు. గూడూరు పెద్ద చెరువు మత్తడి పెంచితే చిన్న, సన్నకారు రైతులకు చెందిన భూములు మునుగుతాయని, ఎత్తు పెంచకుండా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరారు. కెనాల్ లైనింగ్ రఘుపల్లి చెరువు కట్ట కింద నుంచి ప్రతిపాదించారని, దీంతో రైతులు భూములు కోల్పోయిన రఘుపల్లి చెరువులోకి నీళ్లు రావని, అందుకే కెనాల్ అలైన్‌మెంట్ మార్చితే రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వానికి పరిహారం డబ్బులు అందించడం తగ్గుతుందని, రఘుపల్లి చెరువులోకి నీళ్లు వస్తే మరో 150ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. ఈ మేరకు రైతులు సబ్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాటారం తహసీల్దార్ నాగరాజు, ఎస్‌డీసీ డీఐ గంగాధర్, నాయబ్ తహసీల్దార్లు శివతేజ, షఫీఅహ్మద్, ఆర్ఐ వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈ వెంకన్న, మండల సర్వేయర్ వినయ్, రైతులు తదితరులు ఉన్నారు.

రామప్పను సందర్శించిన స్పెయిన్ దేశస్థుడు



జ్యాన్‌కు ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ వెంకటేష్

వెంకటాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని మంగళవారం స్పెయిన్ దేశానికి చెందిన జ్యాన్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆయన ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్ వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2216	2100
పల్లికాయ (సూక)	7150	6500
పల్లికాయ (పచ్చిది)	4050	3400
కందులు	6766	5540
పెసళ్లు	7152	4645
పత్తి	6950	5800
పసుపు (కాడి)	7607	7522
పసుపు (గోల)	6565	6233
తేజ మిర్చి	13500	9000
డీడీ	12500	12500
వండర్‌హాట్	16500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	13000	9500
దేశీ	30000	25500
సింగిల్ పట్టి	38500	35000
దీపిక	16500	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మానుకోట ఆర్యూబీ నుంచి రాకపోకలు షురూ



మహబూబాబాద్ ఆర్యూబీలో నుంచి వెళ్తున్న వాహనాలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి (ఆర్యూబీ) గుండా మంగళవారం సాయంత్రం నుంచి వాహనరాకపోకలు కొనసాగుతున్నాయి. మహబూబాబాద్‌లో రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో జనవరి 29న ఆర్యూబీని మూసివేశారు. ఈ క్రమంలో వాహనదారులు అటు ఏ క్యాబిన్ రైల్వేగేటు, కురవి రోడ్డులోని రైల్వే ఆర్వోబీ గుండా వాహనరాకపోకలను కొనసాగించారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మునిసిపల్ అధికారులు సిగ్నల్ కాలనీ వద్ద రైల్వే అండర్‌పాస్, అనంతారం రోడ్డులోని రైల్వే అండర్‌పాస్‌లకు మరమ్మతులు చేయడంతో అక్కడ్నుంచి కూడ ద్విచక్రవాహనాలు,చిన్న, చిన్నవాహనాలు రాకపోకలు కొనసాగాయి. రైల్వే అధికారులు ఆర్యూబీ వద్ద మూడవ రైల్వే పనులు పూర్తి చేయడంతో మంగళవారం సాయంత్రం ఆర్యూబీని తెరిచారు. కొత్త బజారు నుంచి పాతబజారుకు వాహన రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

బయ్యారంలో గంజాయి పట్టివేత

▸ ఒడిశా నుంచి వరంగల్ తరలిస్తున్న ముఠా
▸ రెండు బ్యాగుల్లో 20 కిలోలు స్వాధీనం

బయ్యారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం పోలీసులు మంగళవారం సుమారు రూ.10 లక్షల విలువ చేసే 20 కేజీల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకొని, ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం. ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్‌నాయక్, అర్జున్‌దాస్ ఇరువురు ఒరిస్సా నుంచి వరంగల్‌కు గంజాయిని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఇరువురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా తారసపడుతూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని బ్యాగులను పరిశీలించగా.. ఎండు గంజాయి 10 ప్యాకెట్లు లభించినట్లు పేర్కొన్నారు. సుమారు రూ. 10 లక్షల విలువ చేసే 20 కేజీల గంజాయిని స్వాధీన పరుచుకొని గంజాయి రవాణాకు పాల్పడ్డ సంతోష్‌నాయక్, అర్జున్‌దాస్‌లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై వెల్లడించారు. కాగా, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.




గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

హామీలకు.. ఆమోదం వచ్చేనా?

- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజల్లో పెరుగుతున్న ఆశలు, అంచనాలు
- హైదరాబాద్‌కు దీటుగా డెవలప్ చేస్తామని పలుమార్లు ప్రకటించిన ప్రభుత్వం
- పెండింగ్ పనులు, ప్రాజెక్టులకు కేటాయింపులపై సర్వత్రా ఉత్కంఠ
- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు


ఇలాంటి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం నగరవాసులు ఎదురుచూస్తున్నారు..


దేవాదుల ప్రాజెక్టు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయి బడ్జెట్ సమావేశాలు ఇవే కావటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2023 డిసెంబరు 7వతేదీన రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగా.. 2024 మార్చిలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో బడ్జెట్ ప్రవేశ పెట్టలేదు. జూలై 25వ తేదీన ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. దీంతో ఈసారి ప్రవేశ పెట్టే బడ్జెట్ పూర్తిస్థాయిది కావడ ంతో నిధుల వరద పారుతుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం పలు సంద ర్భాల్లో ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చింది. వాటికి సంబంధించిన జీవోలు కూడా విడుదల చేసింది. కానీ నిధుల కేటాయింపులు మాత్రం జరగ లేదు. దీంతో ఈ బడ్జెట్‌లోనైనా ఆ హామీలకు ఆమోదం వస్తుందనే ఆశతో ప్రజలున్నారు. తమ నియోజకవర్గాల్లో సమస్యలను ఎజెండా ఎమ్మెల్యేలు గళం వినిపిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.


ఆగిపోయిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి భవనం

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులపై ఆశలు..

వరద భయంతో వణికిపోతున్న వరంగల్ వాసులకు ప్రభుత్వం భరోసా ప్రకటన చేసింది. నగరంలో భూగర్భ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణానికి రూ.4,170కోట్లు కేటాయిస్తున్నట్లు గత నవంబరు 17న ప్రకటించింది. దీంతో 30ఏళ్ల కల నెరవేరబోతోందని నగరవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ నాలుగు నెలలుగా పనులకు టెండర్లు ఖరారు కాలేదు. అంతేకాకుండా వరంగల్ యూజీడీ కోసం రూ.4,170కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా.. కేంద్ర బడ్జెట్‌లో ఆ నిధుల ఊసులేదు. దీంతో కనీసం రాష్ట్ర బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయింపులు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం తొలి విడత రూ.3,087కోట్లు, రెండో విడతలో రూ.597కోట్లు, మూడో విడతలో రూ.486కోట్లు విడుదల చేయాల్సి ఉంది. అంటే మూడేళ్లలో భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

టెక్స్‌టైల్.. గాడిలో పడేనా..?

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును 1,350ఎకరాల విస్తీర్ణంలో గత ప్రభుత్వం నిర్మాణం చేసింది. రూ.567 కోట్లతో టెక్స్‌టైల్ పార్కులో టీఎస్ఐఐ ద్వారా రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పించారు. అయితే వరంగల్‌కు మరో వస్త్రనగరిగా అభివృద్ధి జరుగుతుందని భావించినా ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదు. కేవలం కైటెక్స్, గణేషా ఎకోపెట్, ఎకోటెక్, కొరి యాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు మాత్ర మే పరిశ్రమలు స్థాపించాయి. వీటిలో స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు రాలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి సమస్యలు తెలుసుకు న్నారు. మొదట భూనిర్వాసితులకు ఇంటి స్థలాలను కేటాయించారు. ఇటీవల 836మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాని కి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశా రు. నవంబరులో మెగా టెక్స్‌టైల్ పార్కులో అభి వృద్ధిపనులకు రూ.160.99 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నిధులు విడుదల కావాల్సి ఉంది. గత ఆగస్టు 12న సీఎం రేవంత్‌రెడ్డి కొరియా పర్యటనలో పెట్టుబడులను ఆహ్వానించినా ఆశించిన ఫలితం రాలేదు. దీంతో వరంగల్ వస్త్రనగరి అభివృద్ధిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అలాగే మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. జనగామ జిల్లా కొడకండ్లలో రూ.61కోట్లతో చేపట్టిన టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేక నిలిచిపోయింది.

నగరానికి ప్రత్యేక ప్యాకేజీ దక్కేనా..?

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. 2016-17లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.250 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి ఏటా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి, ఆ తరువాత గత ప్రభుత్వం చేతులెత్తేసిం ది. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిం ది. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి హైదరా బాద్‌కు దీటుగా వరంగల్‌ను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తుంది. దీంతో వరంగల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా రూ.500కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ఇస్తుందనే ఆశతో ప్రజలు ఉన్నారు.

ఐటీ అభివృద్ధిపై దృష్టి పెట్టండి సారూ..

వరంగల్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం హడావుడి చేసింది. మడికొండలో శివారుల్లో 27ఎకరాల్లో ఐటీ పార్కును 2016లో అభివృద్ధి చేశారు. బెంగళూరు, మైసూరు తరహా లో వరంగల్‌లో ఐటీని అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చారు. ఆశించిన స్థాయిలో కంపెనీలు రాలేదు. వచ్చిన కంపెనీల్లో కొన్ని సౌకర్యాలు లేవంటూ హైదరాబాద్‌కు తరలిపోయాయి. దీంతో ఐటీ ఉద్యోగాల కోసం వరంగల్ యువత హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. సీఎం చొరవ చూపితే వరంగల్‌కు ఐటీ కంపెనీలు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్- వరంగల్ రహదారిని ఇండస్ట్రీయల్ కారిడార్‌గా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

సూపర్ స్పెషాలిటీ పట్టాలెక్కేనా..?

ఉమ్మడి జిల్లా ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వరంగల్ నడిబొడ్డున 56ఎకరాల్లో 24అంతస్తుల్లో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ముందుకు సాగడం లేదు. తొలుత రూ.1,100 కోట్లతో చేపట్టిన పనులను రూ.1,725.05కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.05కోట్లు పెంచటంపై కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అప్పటి నుంచి పనులు పడకేశాయి. ఈ బడ్జెట్‌లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి కావాల్సిన నిధులు కేటాయిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

దేవాదులకు నిధుల గ్రహణం వీడేనా..?

ఉమ్మడి జిల్లా వరప్రదాయనిగా ఉన్న దేవాదుల ఎత్తిపోతల పథకం పాతికేళ్లకు పైగా నత్తనడకన సాగుతోంది. మూడో దశ పనులు పూర్తయినా నీటిని ఎత్తిపోసే స్థాయికి చేరుకోలేకపోతోంది. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాలతో పాటు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో సుమారు 5.56లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మించగా.. సుమారు 3.16లక్షల ఎకరాలకు నీరందుతోంది. ఇంకా 2.40లక్షల ఎకరాలకు అందాల్సి ఉంది. అయితే భూసేకరణే దేవాదుల ప్రాజెక్టుకు ప్రధాన అడ్డంకి గా మారింది. 33,224ఎకరాలకు గానూ, 30,268 ఎకరాలను సేకరించారు. ఇంకా 2,956 ఎకరాలు సేకరించటం అధికారు లకు కత్తిమీద సాములా మారింది. ఈ క్రమంలో ప్రభుత్వం దృష్టి పెట్టి నిధుల కేటాయింపులు చేస్తే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయనే చర్చ జరుగుతోంది.

- కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు వరంగల్ నియో మెట్రో రైల్‌ను ఏర్పాటు చేయాలని 2019 డిసెంబరు 24న అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2025 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేశారు. 2021 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. కానీ ఐదేళ్లుగా ఈ ప్రాజెక్టుకు అడుగుల పడలేదు. ఈ బడ్జెట్‌లోనైనా సీఎం వరంగల్‌లో మెట్రో పరుగులు పెట్టేలా నిధులు కేటాయించాలని కోరుతున్నారు.
- మామునూరు ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వం రూ.205కోట్లు కేటాయించింది. రైతులను ఒప్పించి భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.205కోట్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.
- స్టేషన్‌ఘనపూర్ కేంద్రంలోని శివునిపల్లిలో 117ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కు నిర్మాణం చేయాలని 1999లో ప్రతిపాదనలు చేశారు. రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారీపై చెన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు.
- పాలకుర్తి నియోజకవర్గంలో 2009లో పాలకుర్తి- చెన్నూరు రిజర్వాయర్ పనులకు రూ.370కోట్లతో ప్రతిపాదనలు చేసి, 2021లో పనులు ప్రారంభించారు. నిధుల కొరతతో అసంపూర్తిగా వదిలేశారు.

మరన్ని పనులు.. కావాల్సిన నిధులు..

పాలకుర్తి రిజర్వాయర్ కింద 7,516 ఎకరాల్లో, చెన్నూరు రిజర్వాయర్ ద్వారా 25,165 ఎకరాల్లో పంట సాగు కానుంది. దీనిపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- పరకాల నియోజకవర్గంలో 2017లో గీసుకొండ మండలం కొనాయిమాకులం వద్ద రూ.63కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. భూసేకరణ సమస్యతో పనులు నిలిచిపోయాయి. ఈ లిఫ్ట్ పూర్తి అయితే సుమారు 14వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.
- సింగరేణి ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిలో మైనింగ్ యూనివర్సిటీ కోసం కార్మికుల పిల్లలు ఎదురుచూస్తున్నారు. పదేళ్లుగా అన్ని పార్టీలు హామీలిస్తున్నాయి. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా మైనింగ్ వర్సిటీతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే ఆశతో కోల్‌బెల్ట్ ప్రజలున్నారు.
- డోర్నకల్ నియోజకవర్గంలో మరిపెడ మినహా ఇతర మండలాల్లో డిగ్రీ, జూనియర్ కాలేజీలు లేవు. అలాగే జనగామ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు హామీగానే మిగిలిపోయింది.
- బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపి, పనులు ప్రారంభించాలని కార్మికులు కోరుతున్నారు.
- ఏజెన్సీలో అటవీ, రెవెన్యూశాఖల మధ్య నెలకొన్న సుమారు 10వేల ఎకరాల వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపేలా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలని గిరిజనులు కోరుతున్నారు.
- వరంగల్ ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కోర్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా దృష్టి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.
- కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రం, డోర్నకల్‌లో మిర్చి యార్డు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది.
- భూపాలపల్లి జిల్లా కాటారంలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.350కోట్లు అవసరంగా గుర్తించారు.
- మహబూబాబాద్ జిల్లా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) హార్టికల్చర్ యూనివర్సిటీగా మార్చాలనే డిమాండ్ ఉంది. 1998 నుంచి ఇక్కడి రైతులు హార్టికల్చర్ యూనివర్సిటీ కోసం ఆందోళనలు చేస్తున్నారు.
- వరంగల్ జైలును 2021 జూన్ 1న కూల్చేసి ఆస్పత్రిని నిర్మించారు. మామునూరులో రూ.250కోట్ల వ్యయంతో అత్యంత ఆధునికంగా నిర్మిస్తామన్న ఈ జైలు పనులు నిధుల్లేక ముందుకు సాగటం లేదు.
- ఖిలా వరంగల్ కోటను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిధులిస్తారని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.

పాటల పరిమళం కందికొండ

- 20 ఏళ్ల సినీ ప్రస్థానం.. 1300లకుపైగా పాటలు
- కవి, రచయిత, కథకుడిగా కూడా గుర్తింపు

నేడు కందికొండ యాదగిరి వర్ధంతి



హనుమకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : 'మళ్లీ కూయవే గువ్వా..' అంటూ తన పాటలతో మనసులను జివ్వుమనిపించారు. 'గుచ్చి గుచ్చి చంపకే..' అంటూ కుర్రకారు హృదయాలను హుషారెత్తించారు. 'గల గల పారుతున్న సెలయేరులా..' అంటూ తనువుల ను పరవశింపజేశారు. మరోవైపు జానపద పా టల పూదోటలో మట్టిపరిమళలాను వెదజల్లా రు. బతకమ్మను పాటలనూ ఆవిష్కరించి తెలంగాణ సంస్కృతిని ఎలుగెత్తిచాటారు. ఆయ నే కందికొండ యాదగిరి. ప్రముఖ సినీగీత రచ యిత, కవి రచయిత, కథకుడు అయిన కంది కొండ క్యాన్సర్ బారిన పడి కన్నుమూశారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా యాదగిరి పాటల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

నాగుర్లపల్లి వాసి.. చక్రితో పరిచయం

20ఏళ్ల సినీ జీవితంలో 1300కుపైగా పాటలు రాసిన కందికొండ స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. ప్రాథమిక విద్య సొంతూర్లోనే పూర్తి చేసిన ఆయన డిగ్రీ వరకు మహబూబాబాద్‌లో చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ (తెలుగు లిటరేచర్), ఎంఏ (పొలిటికల్ సైన్స్) పూర్తి చేసి.. ఇదే యూనివ ర్సిటీ నుంచి తెలుగులో పీహెచ్‌డీ కూడా అందుకున్నారు. కందికొండ తాను చదువుకునే రోజుల నుంచే పాటలు రాయడం నేర్చుకున్నా రు. కందికొండ ఇంటర్ చదివేటప్పుడే సినీ సంగీత దర్శకుడు చక్రితో పరిచయం ఏర్పడిం ది. మొదట్లో జానపద గీతాలు రాసిన కందికొం డ.. తొలిసారిగా చక్రి సంగీత దర్శకత్వం వహించిన ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం చిత్రం లో 'మళ్లి కూయవే గువ్వా...' అనే పాటను రచించి.. సినీ సాహిత్యంలో అడుగు పెట్టారు. ఆ పాట చాలా పాపులర్ అయింది. సంగీత దర్శకుడు చక్రి, దర్శకుడు పూరీ జగన్నాథ్ వరుస అవకాశాలివ్వడంతో సినీ పరిశ్రమలో కందికొండ గేయరచయితగా నిలదొక్కుకున్నా రు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్‌బాబు నటించిన పోకిరీ సినిమాలోని 'గల గల పారుతున్న సెల యేరులా' పాటను కూడా ఆయనే రచించారు. ఇడియట్ సినిమా లో 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే' పాట కూడా యాదగిరి కలం నుంచి జాలువారిందే. శ్రీకాంత్ నటించిన కోతల రాయుడు కందికొండ ఆఖరి చిత్రం కాగా.. కందికొండ తన పన్నెండేళ్ల సినీ ప్రస్థా నంలో 1300కుపైగా పాటలు రాశారు. ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం, 143, ఆంధ్రావాలా, అల్లరిపిడుగు, ఆప్తుడు, ఒక రాధా ఇద్దరు కృష్ణుల పెళ్లి, చక్రం, ఎంజాయ్, ఆడుతూ పాడుతూ, షాక్, రణం, పోకిరి, సీతారాముడు, స్టాలిన్, తొలిచూపులోనే, చిన్నోడు, భాగ్యలక్ష్మి బంబర్ డ్రా, ఆదిలక్ష్మి, నువ్వంటే నాకిష్టం, ధన 51, అమ్మ నాన్న తమిళ అమ్మాయి,మున్నా, లవ్ యు బంగారం, తదితర సినిమాలు పేరుతెచ్చిపెట్టాయి.

జానపదాన్ని విడిచిపెట్టని కందికొండ..

కండికొండ సినిమాల్లో పాటలు రాస్తూనే తనకు ఇష్టమైన జానపదాన్ని విడిచిపెట్టలేదు. తెలంగాణ యాస, బాషను ప్రాణంగా బావించే ఆయన తెలంగాణ నేపథ్యంగా 200పైగా జానపద గీతాలను రచించారు. తెలంగాణ యాసలోనూ తెలంగాణ నేపథ్యం ఉట్టిపడేలా పలు ప్రైవేటు ఆల్బమ్స్‌కు సాహిత్యం అందిం చారు. తెలంగాణ సాహిత్యం, మాండలికం, యాసపై పట్టున్న కందికొండకు ఆదే కళ ఆయ నకు గేయరచయితగా మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆయన బతుకమ్మ నేపథ్యంలో రాసి న పాటలు పల్లెపల్లెనా, గడపగడపనా జనాల నోట మారుమ్రోగాయి. ఆయన పాటలే కాదు కవిత్వంలోనూ దిట్ట. తెలంగాణ యాసలో మన సుకు హత్తుకునేలా కవిత్వం రాయటం ఆయన ప్రత్యేకత. మట్టిమనుషుల వెతలను, పల్లె బతుకు చిత్రాన్ని కథలుగా రచించి ఆయన ఒక మంచి కథకుడిగా విశేష ఆదరణ పొందారు.

క్రీడలపై ఆసక్తి.. బాడీబిల్డర్‌గానూ రాణింపు

కందికొండకు క్రీడలపై ఎంతో ఆసక్తి ఉండే ది. ఇంటర్ చదువుతున్న రోజుల్లో పరుగు పందెంలో జాతీయ స్థాయిలో పలు పతకాలను గెలుచుకున్నారు. తర్వాత బాడిబిల్డింగ్‌పై దృష్టి పెట్టి అందులోనూ రాణించారు. డిగ్రీ ఫస్టియర్‌లో మిస్టర్ కళాశాల, ఆ తర్వాత మిస్టర్ మహ బూబాబాద్ అవార్డులను అందుకున్నారు. 1998 లో పృథ్వీ పేరుతో వార పత్రికను స్థాపిం చారు. విలేకరులను నియమించుకొని మహ బూబాబాద్, నర్సంపేట, ప్రాంతాల్లోని రాజకీ య, సామాజిక అంశాలపై కథనాలు ప్రచురించి పలువురి మన్ననలను పొందారు. అలాగే సినిమా పాటల రచయితగా స్థిరపడిన తర్వాత తన మకాంను హైదరాబాద్‌కు మార్చి నా తాను పుట్టి పెరిగిన ఊరు నాగుర్లపల్లెను మరిచిపోలేదు. స్వగ్రామంలో నాలుగు గుంటల స్థలం కొనుగోలు చేసి సొంతంగా ఇల్లు నిర్మిం చుకున్నారు. 2021లో బతుకమ్మ పాటను రచిం చిన కందికొండ స్వగ్రామం నాగర్లపల్లెలోని మాధన్నపేట సరస్సు కట్టపై బతుకమ్మ పాట చిత్రీకరణ చేయించారు. ఇక కందికొండ చిన్న వయసులోనే క్యాన్సర్‌బారిన పడి జయించారు. కానీ ఆ తర్వాత కాలంలో తిరగబెట్టగా.. ఎక్కువ కాలం కీమోథెరపీ చేయించుకోవడంతో వెన్నెముక దెబ్బతిని నడవలేని స్థితికి చేరుకు న్నారు. సర్జరీ చేసినా ఆరోగ్యం మెరుగు పడలేదు. చివరకు 2022 మార్చి 12న హైదరాబాద్‌లోని తన ఇంట్లో కన్నుమూశారు. ఆయనకు భార్య రమాదేవి, కూతురు మాతృక, కుమారుడు ప్రభంజన్ ఉన్నారు. తల్లిదండ్రులు సాంబయ్య, కొమురమ్మ. దంపతులకు ముగ్గురు సంతానంలో కొందికొండే పెద్ద. ఆయన మరణంతో వరంగల్ జిల్లా ఒక గొప్ప సినీ గేయరచయితను కోల్పోయింది. ఆయన రాసిన పాటలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

కొండపర్తిని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతాం


వనదేవతల సన్నిధిలో ఎత్తు బంగారం తూగుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- వికసిత్ భారత్ స్ఫూర్తిగా బ్రాండ్ ఇమేజ్ సాధిస్తాం
- దత్తత గ్రామ పర్యటనలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- బహుళ ఉపాధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- హాజరైన మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు

తాడ్వాయి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అడవిపల్లె కొండపర్తి గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామని, వికసిత్ భారత్ స్ఫూర్తిగా బ్రాండ్ ఇమేజ్ సాధిస్తామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. తాను దత్తత తీసుకున్న ములుగుజిల్లా తాడ్వాయి మండలం కొండపర్తిలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో కలిసి బహుళ ఉపాధి కార్యక్రమాలను ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు కొండపర్తికి చేరుకున్న గవర్నర్‌కు మహిళలు, కళాకారులు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. విద్యార్థులతో డిజిటల్ పాఠాలను విన్నారు. వారితో ఇంగ్లిష్‌లో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పలకలపై బొమ్మలు గీసి చూపించారు. ఆ తర్వాత గ్రామంలో రూ.35లక్షలతో నిర్మించిన బహుళార్థక భవనాన్ని ప్రారంభించారు. రూ. 7,84,700తో ఏర్పాటు చేసిన మసాల యూనిట్, రూ.7, 76,594 వ్యయంతో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ యూనిట్‌ను ప్రాంభించారు. అనంతరం రిమోట్ తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ మాట్లాడారు. కొండపర్తిలో 70 ఆదివాసీ గృహాలు, 285మంది ప్రజలు నివసిస్తున్నారని, ఇది చిన్న గ్రామమైనా అభివృద్ధిలో ఆదర్శంగా నిలువాలని గవర్నర్ జిష్ణుదేవ్ ఆకాంక్షించారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరం అన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడుతుండటం అభినందనీయమన్నా రు. మహిళలు ఆర్థికాభివృద్ధికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ సంస్థ ఏ విధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా యూనిట్లు కూడా అంతే పేరు గడించాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని మిర్చి పౌడర్‌కు మంచి ఇమేజ్ రావాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మిర్చి పౌడర్ ఫేమస్ కావాలని సూచించారు.


వికసిత్ భారత్‌కు స్ఫూర్తిగా కొండపర్తి

ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పానికి కొండపర్తి గ్రామం ఆదర్శంగా నిలువాలని గవర్నర్ పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, రాష్ట్రంలో ఇంకా ఏడు ఆదివాసి గ్రామాలను దత్తత తీసుకున్నానని అన్నారు. దేశంలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

కొండపర్తిలో రూ. 1.5కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి, పేద ప్రజలు, మహిళల ఆర్థికాభివృద్ధికి తాను, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాగం కృషి చేస్తోందని తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు వల్ల ఆదాయం సమకూరుతుందని, తద్వారా ఆదివాసీలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని అన్నారు. తాను, రాష్ట్రపతి, మంత్రి సీతక్క అందరం ఆదివాసి బిడ్డలమని తెలిపారు. దేశానికి కొండపర్తిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.







సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పాఠశాలలో పిల్లలతో కలిసి డిజిటల్ పాఠాలు వింటున్న గవర్నర్ జిష్ణుదేవ్

సారలమ్మను దర్శించుకుంటున్న గవర్నర్

జిల్లా యంత్రాగం సేవలు అభినందనీయం : మంత్రి సీతక్క

జిల్లా అభివృద్ధికి, కలెక్టర్ దివాకర, యంత్రాగం సేవలు అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. దట్టమైన అడవిలో ఉన్న మారుమూల గ్రామమైన కొండపర్తిలో చకాచకా అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. కనీసం రవాణా సౌకర్యం కూడా లేని గ్రామాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందన్నారు. మహిళల స్వావలంబన ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మహిళలు మహళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ గ్రామానికి అనతి కాలంలోనే రహదారి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు గవర్నర్ ఏడు బోరు మోటర్లు మంజూరు చేశారని తెలిపారు. గ్రామస్థులు రెండు పంటలు పండించే అవకాశం కల్పించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 40 పరిశ్రమలు దిశా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 పాఠశాలలు దత్తత తీసుకున్నామని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఆదివాసి విద్యార్థులకు అద్భుతమైన విద్యా బోధనలు జరుగుతున్నాయని అన్నారు.

కలెక్టర్ దివాకర మాట్లాడుతూ 70 గృహాలు, 285 మంది జనాభా కలిగిన ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు గవర్నర్ దత్తత తీసుకోవడం గొప్ప విషయమన్నారు. గవర్నర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న వెంటనే ఈ గ్రామం అభివృద్ధిలో పథంలో ముందుందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల భవనాలకు రూ. 70లక్షలతో మరమ్మతులు చేపట్టామని, ఆధునాతన హంగులతో వినియోగంలోకి తెచ్చామని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి గవర్నర్ రూ. 1.5కోట్లు మంజూరు చేశారని తెలిపారు. పంటలను సాగు చేసుకొనేందుకు బోర్లు నిర్మించారన్నారు. తద్వారా 50ఎకారాల్లో మిర్చి సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏడీసీ మేనేజర్ అమన్ కుండు, గవర్నర్ సీఎస్‌వో శ్రీనిస్‌వావు, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, జిల్లా గ్రథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, గ్రామ పెద్దలు లచ్చుపటేల్ గ్రామ ప్రజలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలకు ప్రత్యేక పూజలు

మేడారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. కొండపర్తి పర్యటన అనంతరం తల్లును దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

భారీ భద్రత నడుమ గవర్నర్ పర్యటన

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో గవర్నర్ పర్యటనలో భాగంగా జిల్లా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. తాడ్వాయి నుంచి మేడారం వైపు మీదుగా వాహనాలను తరలించారు.

కొంత సమయం వరకు తాడ్వాయి పస్రా రహదారి వాహనాలు నిలిపివేశారు. దారి పొడవునా బందోబస్తు ఏర్పాటు చేశారు. వనదేవతల దర్శనాల సమయంలో గద్దెల గేట్లకు తాళాలు వేసి సామన్య దర్శనాలు నిలిపి వేశారు.


కొమురం భీం విగ్రహావిష్కరణలో పాల్గొన్న జిష్ణుదేవ్ వర్మ, సీతక్క, అధికారులు

పర్యావరణ హిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

కొండపర్తి గ్రామాన్ని పర్యావరణ పరిరక్షణ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా గవర్నర్ కొండపర్తిని దత్తత తీసుకున్నారని ఆయన కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికీ ఆదాయం సమకూరాలనే సంకల్పంతో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడ తయారు అవుతున్న కారం, పసుపు, మసాలా పౌడర్ యూనిట్‌కు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక సంఘలకు వ్యాపార నిర్వహణకు ప్రముఖ ప్రాంతంలో దుకాణాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో 150 ఎకారాల్లో లాభదాయకమైన మార్కెటింగ్ కలిగిన ఆధునిక వ్యవసాయం సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గవర్నర్ తీసుకున్న ఏడు గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి పాటుపడే సంస్థలకు రాష్ట్ర వ్యాప్తంగా అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

- గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నేతలు


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ నేతలు

ములుగు కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామ పర్యటనకు వెళ్లే క్రమంలో ములుగు సమీపంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. మంత్రి తోపాటు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ గవర్నర్‌కు పుష్పగుచ్చాలు, మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో మంత్రి సీతక్క భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివ రించారు. మారుమూల ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛందంగా సహ కారం అందిస్తున్న సంస్థలను గుర్తిస్తూ పురస్కారాలు అందించాలని కోరారు. ఐదవ షెడ్యూల్డ్ పరిధి ములుగు జిల్లాలోని గ్రామాల అభ్యున్నతి కోసం చేయూతనివ్వాలని కోరారు.

గవర్నర్ ను కలిసిన బీజేపీ నాయకులు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈసందర్భంగా మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, నాయకులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అంద జేసి చేపట్టే పలు అభివృద్ధి పనులను వివరించారు. ములుగు జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేయబోయే సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూ.80 0కోట్లకుపైగా నిధులు కేటాయించినప్పటికీ నేటి వరకు కూడా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని నాయకులు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీ అభివృద్ధి పనులు త్వరగా చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2025-26 సంవత్సరానికి ట్రైబల్ యూనివర్సిటీలో నోటిఫికేషన్లు విడుదల అయ్యాయని, విద్యార్థులు వస్తే తరగతులు, హాస్టల్ వసతులు కల్పించడానికి ఇంతవరకు భవన నిర్మాణాలు ప్రారంభం కాలేదని అన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారని, ఈవిషయంపై స్పందించి గిరిజన యూనివర్సిటీకి సంబంధించిన భవన నిర్మాణాలు ఏర్పాటుచేసే విధంగా చూ డాలన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపట్టాలని, కేంద్రం ఇస్తున్న నిధులు తప్ప రాష్ట్రానికి సంబంధించిన నిధులు ములుగు జిల్లాకు రావడంలేదని వారు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు అభివృద్ధి చేపట్టాలని కోరుతూ గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్‌రావు, మేడిశెట్టి ఓమ్రా, రవీందర్, గంగిశెట్టి రాజ్‌కుమార్, దొంతిరెడ్డి రవిరెడ్డి, తాళ్లపల్లి లక్ష్మణ్, జంగా హన్మంతరెడ్డి, సిద్దబోయిన సురేందర్, భూక్య శ్రీను, మాదరి శ్రీకాంత్, సుభాష్, ఆలం శ్రీను, చిన్న, నవీన్, సంధ్యారాణి, ప్రశాంత్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని వినతి

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తాడ్వాయి మండలంలో పర్యటించిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆదివాసీ నవ నిర్మాణసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. బాండ్ మొక్కజొన్న పంటను సాగుచేసిన రైతులు నష్టపోయారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయమై విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు రాంబాబు, నాగుల ప్రవీణ్, మధు, సారయ్య, వెంకటరమణ, ధన, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

గోవిందరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధే చేయడమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పస్రాలో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతోపాటు కోటగడ్డలో బీటీరోడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇప్పటికే ములుగు జిల్లాకు రూ.500కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, మెడికల్ కళాశాల, గిరిజన యూనివర్సిటీకి భూమి కేటాయించడం జరిగిందని, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, మల్లంపల్లి మండలం ఏర్పాటు, జిల్లాకేంద్రంలో మోడల్ బస్టాండ్, ఏటూరునాగారంలో బస్సుడిపో మంజూరు చేశామని అన్నారు. పలురకాల అభివృద్ధి కార్యక్రమాలతో కోటిమంది మహిళలను కోటీశ్వరులను


సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

చేయడమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందని అన్నారు. మహిళా గ్రూపులకు కూడా స్వయం ఉపాధియే లక్ష్యంగా, ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, సహకార సంఘం అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, డీఈ ధర్మేంద్ర, జిల్లా కార్మికశాఖ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

ఏటూరునాగారం రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు మావోయిస్టు సభ్యులు జన జీవన స్రవంతిలో కలిశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపా ధ్యాయ ఎదుట దళ సభ్యులు లొంగిపోయారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఈ మేరకు వారి వివరాలను ఏఎస్పీ వెల్లడించారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన సోడి జోగ అలియాస్ పున్నం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన కడితి ఇడుమ అలియాస్ దేవ, పూజారి కాంకేర్ ఆర్‌పీసీ సభ్యుడైన పద్దం జోగా ఉన్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక పార్టీ నుంచి బయటికి వచ్చారని, ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకర్షితులై జన జీవన స్రవంతిలో కలిసిపో తున్నట్లు వారు తెలిపారని ఏఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వెంకటాపురం సీఐ కుమార్, సీఆర్పీఎఫ్ కమాండర్ ప్రశాంత్ పాల్గొన్నారు.


లొంగిపోయిన మావోయిస్టులను చూపుతున్న ఏఎస్పీ

రెండు ఇళ్లు దగ్ధం

మల్హర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధమైన ఘటన మండలం కేంద్రమైన తాడిచర్లలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు కుమార్ ఇల్లు పూర్తిగా, ఇందారపు రవి ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. ఇవి పక్కపక్కనే ఉండటంతో రెండూ దగ్ధమయ్యాయి. కుమార్ ఇంటిల్లిపాది పనులకు వెళ్లడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. కుమార్ పూర్తిగా ఇల్లు కాలిపోయి నిత్యావసర వస్తువులు, సామగ్రి, దుస్తులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కుమార్ ఇంట్లో రూ. 20 వేల నగదు, బంగారంతో పాటు సామగ్రి అంతా కలిపి రూ 15 లక్షల నష్టం వాటిల్లింది. పక్కనే ఉన్న రవి ఇంట్లో మంటలు వ్యాపించి రూ. 3 లక్షల నష్టం సంభవించింది. సంఘటన స్థలాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఇరు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు.

మళ్లీ పులి సంచార కలకలం

కాటారం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాటారం రేంజ్ వీరాపూర్ బీట్ పరిధిలోని అడవుల్లో పెద్దపులి లేగదూడపై దాడి చేసి చంపడం కలకలం రేపింది. వారం రోజులు తిరక్కుండానే మళ్లీ కాటారం రేంజ్ అడవుల్లో పెద్దపులి సంచారం, మూగ జీవాలపై దాడి చేసి చంపడం కలవర పెడుతోంది. సోమ వారం జాదరావుపేట సమీప అడవుల్లో సంచ రించిన పులి మేత కోసం వెళ్లిన లేగదూడపై దాడి చేసి గొంతు కొరికి చంపింది. దీంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గత నెల 10న మండలంలోని నస్తూరుపల్లి అడవుల్లో మొదట కని పించిన పులి ఏకదాటిగా ఈ నెల 4 వరకు కాటారం, మహదేవపూర్, పలిమెల రేంజ్‌ల పరిధి లోని అడవుల్లో సంచరించినట్లు పాదముద్రల ద్వారా అటవీశాఖ అధికారులు గుర్తించారు. అయితే.. పశువులను పులి చంపి తిన్నట్లు ఆనవాళ్లు దొరకలేదు. వారం రోజుల క్రితం జిల్లా సరిహద్దులు దాటి పులి వెళ్లినట్లు పగ్‌మార్క్స్ ఆధారంగా అంచనా వేసిన అధికారులకు మళ్లీ పులి కాటారం రేంజ్ అడవుల్లో సంచ రించడం, ఏకంగా లేగదూడపై దాడిచేసి చంపడం కలవపెడుతోంది. గత నెలలో సంచ రించిన పులి ఈ పులి ఒక్కటేనా? అనే అనుమా నాలు తలెత్తుతున్నాయి. కాటారం, మహదేవపూర్ రేంజ్ అధికారులు స్వాతి, రవికు మార్ నేతృత్వంలో పలువురు అధికారులు, సిబ్బంది పులి జాడ కోసం గాలింపుచర్యలు చేపట్టారు. పాదముద్రల ఆధారంగా అన్నారం అడవుల వైపు పులి వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. లేగదూడను చంపిన పెద్దపులి దాన్ని తినడానికి వస్తుందనే అభిప్రాయంతో అటవీ శాఖ అధికారులు, ట్రాకర్లను రప్పించి ట్రాప్ కెమెరాలను బిగింప జేశారు. అడవుల్లోకి ఎవరూ వెళ్లవద్దని, పశువులను తోలుకొని వెళ్లొద్దని, పులికి ఎలాంటి హాని తలపెట్టినా చర్యలు తప్పవని ఎఫ్ ఆర్వో స్వాతి హెచ్చరించారు. అడవుల గాలింపు చర్యల్లో డీఆర్వోలు సురేందర్, శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వో చం ద్రశేఖర్, బీట్ అధికారులు రాజ్‌కుమార్, సంజీవ్, రాజేందర్, మోనా కౌసర్, జయలక్ష్మి పాల్గొంటున్నారు.

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక సౌకర్యాలకు కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గోపాలపురం, ముచినిపర్తి, చల్లగరిగ, జూకల్లు, తిరుమలపురం, చిట్యాల, నవాబుపేట, చింత కుంటరామయ్యపల్లి, బావుసింగ్‌పల్లి, గాంధీనగర్, నైన్ పాక, వరికోల్‌పల్లి, ఛైన్‌పాక, వెంచరామి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం శంకు స్థాపనలు చేశారు. గత తెగిపోయిన చెరువులు, కుంటలకు బీఆర్ఎస్ ప్రభుత్వం మరమ్మతు పనులు చేయకపోవడం వల్లే రైతులకు సాగునీటి కొరత ఏర్పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతిపాదనలు వేయించి మరమ్మతు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులతో ప్రత్యేకంగా చర్చించానన్నారు. చలివాగు ద్వారా చివరి ఆయకట్టుకు చేరే విధంగా సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలి పారు. వచ్చే ఏడాది పంటలకు చలివాగు ప్రాజెక్టు, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా 24 గంటలు నీటిని విడుదల చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో తహసీల్దార్ హేమ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా నాయకులు మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, రాయకొమ్ము, పులి తిరుపతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, గడ్డం కొమురయ్య, పువ్వాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

కృష్ణకాలనీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రం లోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం క్రీడా పోటీలను మహిళలకు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని ఈ పోటీలు జరగ్గా ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. మహిళా తలుచుకుంటే సాధించలేనిదేమీ లేద న్నారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని లక్ష్యసాధన లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి, సీడీపీవో మల్లీశ్వరి, సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త ఉద్యోగాలు సాధించిన వారు విధి నిర్వహణలో అంకిత భావాన్ని ప్రదర్శించాలని సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో జరిగిన ఇంటర్నల్ జూనియర్ సర్వే ఆఫీసర్ పరీక్షలలో భూపాలపల్లికి చెందిన సర్వేయర్లు రాజశేఖర్ (ప్రథమ స్థానం), పి. శ్రీకాంత్ (ద్వితీయ స్థానం) దక్కించుకున్నారు. వారిని మంగళవారం జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్లు జీఎం పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ పరీక్షలలో మొత్తం 64 ఖాళీలకు 67 మంది అభ్యర్థులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన వీరిని జీఎం అభినందించారు. వీరితో పాటు జూనియర్ ఆఫీసర్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రథమ ర్యాంక్ సాధించిన బాలసుబ్రమణ్యంను జీఎం అభినం దించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు వెంకటరామారెడ్డి, శైలేంద్రకుమార్, వినోద్ కుమార్, గుండు రాజు క్రాంతి కుమార్, ఏరియా అధికార ప్రతినిధి మారుతి పాల్గొన్నారు.

'బార్' అధ్యక్షుడికి సన్మానం

భూపాలపల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బార్ అసోసియేషన్ అధ్య క్షుడు కూనూరు సురేష్ కుమారన్ను తోటి న్యాయవాదులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సురేష్ కుమార్ న్యాయవాదిగా 26ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా కోర్టు ఆవరణలో సివిల్ కేసులపై సీని యర్ న్యాయవాది కేపీకే గుప్తా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్‌ను సన్మానించారు. సురేష్‌కుమార్ పేదలకు అండగా న్యాయసేవలు అందించడమే కాకుండా తోటి న్యాయవాదుల సమస్యలపై పోరాడు తున్న నాయకు డని కొనియాడారు.


సురేష్ కుమార్‌ను సన్మానిస్తున్న తోటి న్యాయవాదులు

పైరవీలకే పరిమితమైన టీబీజీకేఎస్

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కృష్ణకాలనీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లల్లో టీబీజీకేఎస్ గుర్తిం పు సంఘం పైరవీలకే పరిమి తమైందని, కార్మికుల శ్రేయస్సును ఏ మాత్రం పట్టిం చుకోలేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ విమర్శించారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 6వ గనిలో మంగ ళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో నూతన గనులు, ఇన్‌కమ్ టాక్స్ మాఫీ, కార్మికుడికి సొంతింటి కల, డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకో వడం వంటి అంశాలు సాకారం కాబోతు న్నాయని అన్నారు. సీఅండ్ఎండీతో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో ఈ అంశాలన్నింటిపై చర్చించామని, దీనిపై సానుకూల స్పందన వచ్చిందని తెలిపారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, మనోజ్ కుమార్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, గోవర్ధన్, లక్ష్మణమూర్తి, గణేష్ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధన దిశగా నిరసన దీక్షలు

మహదేవపూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : వర్గీకరణ సాధన దిశగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం దీక్షలు ప్రారంభమయ్యాయి. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లం పల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో ఈ నిరసనను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొలుగూరి రాజయ్య, బెల్లం పల్లి మల్లేష్, చింతకుంట్ల సదానందం, లింగాల సుశాంత్, బెల్లంపల్లి జాషువా, లింగాల సాగర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

మహదేవపూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరద్ధరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలోనే అమలు చేయాల్సిన పీఆర్సీ ఇప్పటికే అమలుకు శోచనీయమని తెలిపారు. సీపీఎస్ రద్దు చేసే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పలిమెల మండలాల జోన్ బాధితులు బి.తిరుపతిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ బి.లక్ష్మణ్ నాయక్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి.ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మడక మధు, ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మడక మధు, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి సారంగపాణి, ఉపాధ్యక్షుడు ఆర్.తి రుపతి, జె.రజిత, శ్రీకాంత్, శ్రీధర్, కార్యదర్శులుగా జి.సాయి కుమార్, సంతోష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, సాంబయ్య ఎన్నుకున్నారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల భారీ గైర్హాజరు

ములుగు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్షలకు విద్యార్థులు పెద్దసంఖ్యలో గైర్హాజరవుతున్నారు. మంగళవారం జరిగిన మొదటి సంవత్సరం బోటనీ, పొలిటికల్ సైన్స్, గణితం పరీక్షకు 2043మందికి గానూ 1927మంది హాజరయ్యారు. 116మంది గైర్హాజరయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు కూడా 40మందికి పైగా విద్యార్థులు హాజరు కావడంలేదు.

ఎయిడ్స్‌పై అవగాహన

గోవిందరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కళాకారులు ఆటపాటల ద్వారా కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ తప్పట్ల కిషన్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా హెచ్‌ఐవీ నాలుగు మార్గాల ద్వారా వస్తుందని, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, ఇంజక్షన్లు, పరీక్షించని రక్త మార్పిడి, హెచ్‌ఐవీ గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకు వస్తుందని అన్నారు. అనంతరం గ్రామస్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాజాత రమేష్ బృందం సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తన శాంపిళ్ల సేకరణ

వెంకటాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో మంగళవారం బాండ్ మొక్కజొన్న విత్తనాల శాంపిళ్లను మండల అధికారులు సేకరించారు. ఆయా మండలాల్లో గత కొంతకాలంగా మొక్కజొన్న బీటీ విత్తన సాగు జరుగుతుందని రైతులు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో విత్తనాలు, ఆకులను ఏటూరునాగారం ఏడీఏ అవినాష్‌వర్మ ఆధ్వర్యంలో సేకరించారు. సేకరించిన విత్తనాలను సీజ్ చేసి పరీక్షల కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు మండల వ్యవసాయ అధికారి నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాజేడు వ్యవసాయ అధికారి మహేష్, ఏఈవోలు శ్యామ్, జాఫర్, హరీష్, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులాన్ని తనిఖీ చేసిన ఎంపీవో

వాజేడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జంగాలపల్లిలో ఉన్న మినీ గురుకులాన్ని ఎంపీవో శ్రీకాంత్ నాయుడు మంగళవారం తనిఖీ చేశారు. గురుకులంలోని పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రామాణాలు పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

మాదిగలను మోసం చేస్తే సహించం

ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ

ములుగు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత చేశాకే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ములుగు కలెక్టర్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోతి కార్తీక్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్ష జరగగా మంద కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణలో మాదిగలు, మాదిగ ఉప కులాల సామాజిక కుల వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ 30ఏళ్ల నుంచి అలుపెరగని పోరాటాలు చేశారని, అందులో భాగమే ఎస్సీ వర్గీకరణ పోరాటమని అన్నారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత చేసి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, నాయకులు మరాఠి రవీందర్, రెంటాల భిక్షపతి, బల్గూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏటూరునాగారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని సినిమా టాకీస్ వద్ద సాయంత్ర కమలాపురం గ్రామానికి చెందిన శెట్టి నరేష్(30) ద్విచక్ర వాహనంపై వస్తూ ఆగి ఉన్న మినీ బస్సును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమిం చడంతో మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికి త్స అందిస్తున్న క్రమంలోనే నరేష్ మృతి చెందాడు. మృతుడి భార్య అమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలపారు.

వసతి గృహాల్లో వైద్య శిబిరాలు

మంగపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మంపేట ఎంపీపీఎస్, తిమ్మంపేట గిరిజనుల హాస్టల్, మంగపేటలోని కేజీబీవీలో విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాలను మెడికల్ ఆఫీసర్ అఖిల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు తరుణ్, మనోజ్‌తో సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

కాటారం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒడిపిలవంచలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు మంగళవారం కల్యాణోత్సవం కమనీయం సాగింది. నిర్వాహకులు ఊరేగింపుగా స్వామి, దేవేరులకు పట్టు వస్త్రాలు, పుస్తె, మెట్టెలు తీసుకురాగా వేదపండితులు నాగరాజుశర్మ, సంతోష్ చారి, లక్ష్మీకాంత్‌శర్మ ఉత్సవమూర్తులకు కలా ్యణం నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, కళ్యాణవస్త్రాలు, పుస్తె, మెట్టెలు, వెండి బాసికాలు, జంధ్యాలను దాతలు నారాయణ-సమత, భగవాన్ రెడ్డి-నాగరాణి, రాజేష్-శిల్ప దంపతులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుబ్బారావు అందించారు. దేవాలయ వ్యవస్థాపకుడు కర్రు నాగయ్య, నిర్వాహకులు నారాయణ, సత్యనారాయణ, రాంనారాయణ, గోపాల్, పుల్లారెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


తలంబ్రాలు తీసుకొస్తున్న నిర్వాహకులు

భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్

(5వ పేజీ తరువాయి)

సాంకేతికంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన డిజిటల్ విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలను భూపాలపల్లికి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యుడు దబ్బెట రమేష్ సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 43 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తన క్యాంపు కార్యాలయంలో రూ.43.04 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. భూపాలపల్లి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఈ క్యాంటీన్ ఏర్పాటైంది.

పోలీసుల అదుపులో ఇద్దరు?

విడుదల చేయాలని పౌర హక్కు సంఘం డిమాండ్

వాజేడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వారిని విడుదల చేయాలంటూ పౌరహక్కుల సంఘం నేతలు లేఖను జారీ చేయడం చర్చనీయాంశమైంది. వాజేడు వండలంలోని మూరుమురు గ్రామ సమీపంలో ద్విచక్రవాహనాలపై వస్తున్న ఇద్దరును పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ గడ్డం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు పేరిట ఒక లేక విడుదలైంది. జనగాం జిల్లా జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటకు చెందిన ఇల్లందుల విజయ్, నాగరాజును పోలీసులు అరెస్టు చేశారని, ఆ ఇద్దరిని గుట్టలు తిప్పుతూ ఎన్‌కౌం టర్ చేయటానికి ప్రయత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాలను బూటకపు ఎన్‌కౌంటర్లకు కేంద్రాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందని లేఖలో విమర్శించారు. స్థానిక ఆదివాసీ ఎమ్మెల్యే సీతక్క చొరవ తీసుకొని ఆ ఇద్దరిని విడిపించాలని కోరారు.